

ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు నాక్ గ్రేడ్

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల అటానమస్‌కు న్యాక్ ఎ-++ గుర్తింపు లభించినట్లు ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలియజేశారు. నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ వారు కళాశాలలో గల ల్యాబ్, లైబ్రరీ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, మౌలిక సదుపాయాలు తదితర అంశాలను పరిశీలించిన త్రిసభ్య బృందం సిఫారసు మేరకు తమ ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలకు 3.60 స్కోర్‌తో "నాక్ ఎ ప్లస్ ప్లస్ గుర్తింపు లభించినట్లు సతీష్‌రెడ్డి తెలిపారు. భారతదేశంలోని విద్యాసంస్థల, యూనివర్సిటీల క్వాలిటీ స్టేటస్, కరిక్యులం, టీచింగ్, లెర్నింగ్, ప్రాసెస్, ఫ్యాకల్టీ రీసర్చ్ కళాశాల మౌలిక వసతుల కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ ఎం..శ్రీనివాస్ రెడ్డి, డీన్‌లు ఎస్.రమాశ్రీ, జి.సురేష్, కె.వి.ఎస్.రామ చంద్రమూర్తి, టి.నరేంద్రుడు, జె.పవన్, జె.డి. వెంకటేష్ విభాగాధిపతులు పాల్గొన్నారు.

కళ్లాల్లోని కష్టం కన్నీటి పాలు

- ఆగని వానలు • తడిసిన ధాన్యం • ఆరబోత పనుల్లో రైతులు
- తప్పని అదనపు భారం • దయనీయ స్థితిలో అన్నదాత

సామర్లకోట శివారు నెలకొరిగిన పంటను వ్యవసాయ సిబ్బందికి చూపుతున్న రైతు

కరపలో తడిసిన దాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

జిల్లాలో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అకాల వర్షాలు కారణంగా రైతులు కోతలు కోసి కళ్లాల్లో ఆరబెట్టుకున్న ధాన్యం తడిసి ముద్దయి కన్నీటిపాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టగా సగం పంట కూడా చేతికందే పరిస్థితి కనిపిం చడం లేదు. మంగళవారం కూడా కాకినాడ రూరల్, కరప, పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, పెద్దాపురం, గొల్లప్రోలు, తుని, శంఖవరం తదితర మండలాల్లో విస్తారంగా వర్షాలు పడ్డాయి. కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగుతుండ డంతో ధాన్యం ఎక్కడికక్కడ రాశులుగా ఉండిపోయింది. కొన్ని మండలాల్లో వర్షం కాస్త తెరిపివ్వడంతో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

• కొనుగోలు ఆలస్యం కావడంతోనే...

కాకినాడ జిల్లాలో ఇప్పటికే 50 శాతానికి పైనే రబీ కోతలు పూర్తయ్యాయి. కొనుగోళ్ల ఆలస్యంగా ప్రారంభమవడంతో పలుచోట్ల ధాన్యం కళ్ళల్లోనే ఉండిపోయింది. గత 20 రోజుల్లో జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా 1306 మంది రైతుల నుంచి రూ. 19.34 కోట్లు విలువ చేసే 10,244 మెట్రిక్ టన్నుల దాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. వాతావరణ శాఖ గత వారంరోజుల నుంచి వర్షం హెచ్చరికలు చేస్తూనే ఉన్నా జిల్లా యంత్రాంగంలో చలనం లేదు.

• తడిసి ముద్దయిన ధాన్యం

ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేస్తామని ప్రకటనలు ఇచ్చినప్పటికీ ఆచరణలో వాహనాలు, సంచుల కొరత వేధించిన మూలంగా ధాన్యం రోజుల తరబడి కళ్లాల్లోనే ధాన్యం తడిసి ముద్దయింది. సుమారు 80 వేల ఎకరాల్లో కోతలు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా ప్రకారం 10 వేల ఎకరాల్లో వరి నేలను తాకింది. సుమారు 5.50 వేల ఎకరాల్లో వరి కోసి పనలపై ఉంది. మూడు రోజులుగా వర్షాలకు ధాన్యం మొలకెత్తుతుందని రైతులు చెబుతున్నారు. సుమారు 6 వేల ఎకరాల్లో దాదాపుగా 21 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోయిందని అధికారుల లెక్క. అయితే దీనికి రెట్టింపు ధాన్యం రాశులుగా పోసి కళ్లల్లోనే ఉండిపోయింది. ఇంకోవైపు ధాన్యాన్ని నిబంధనల ప్రకారం ఎన్ని రోజులు ఆరాబెట్టాలనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మిల్లర్లు కొనుగోలు చేస్తే తడిసిన ధాన్యం నూకలుగా మారుతుంది. సగం ధర మాత్రమే వచ్చే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

• అదనపు భారం

ఇప్పటికే యంత్రం ద్వారా కోతలు పూర్తి చేయడానికి గంటన్నర సమయానికి ఎకరాకు రూ.3 వేలు చెల్లిస్తున్నారు. వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో పలువురు రైతులు వేగంగా కోతలు పూర్తి చేసేందుకు అధిక ఖర్చు తో పనులు మొదలెట్టారు. ఇప్పుడు రాశులుగా ఉన్న ధాన్యాన్ని ఆరబెట్టేందుకు మూడు, నాలుగు రోజులు సమయం పట్టే అవ కాశం ఉంది. దీంతో బరకాల అద్దె భారం కూడా మోయల్సి వస్తోంది. మరో వైపు ధాన్యం ఆరిన తర్వాత నూకలుగా మారే అవకాశం ఉంది.దాంతో ప్రభుత్వం ఈ ధాన్యాన్ని ఒక వేళ కొనుగోలు చేసినా మిల్లర్లు ఎంత చెల్లి స్తారనేది ప్రశ్నార్థకమే. అనుకూల పరిస్థితుల్లో ఇప్పటికే ఆర్‌బికెల నుంచి మిల్లర్లకు ధాన్యం వెళ తుండగా నూకల శాతం ఎక్కువగా ఉందంటూ మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారు.

• ధాన్యం కొనుగోలు చేస్తాం

రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని కాకినాడ జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ తెలిపారు. మంగళవారం కరపలో, కాజులూరు మండలాల్లో పర్యటించి కళ్లాలపై ఉన్న ధాన్యపు రాశుల్ని పరిశీలించి, రైతులతో మాట్లాడారు. తేమ తగ్గినా, రంగు మారినా ఆందోళన చెందనవసరం లేదని ఆ ధాన్యాన్ని కూడా ఆర్‌బీకేల ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు.

ఆగని వర్షం .. తప్పని ఇక్కట్లు

సామర్లకోటరూరల్: అల్పపీడన ప్రభావంతో రెండో రోజు సామర్లకోట మండల పరిధిలో ఆగి ఆగి వర్షం కురుస్తూనే ఉంది. సోమవారం భారీ వర్షంతో తడిసిన పంటను మంగళవారం ఉదయం కొంతసేపు ఎండ రావడంతో రైతులు ధాన్యం రాశులను విడదీసుకుని ఆరబెట్టుకునే ప్రయత్నం చేశారు. మంగళ వారం సామర్లకోటలో 33.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయింది. మళ్లీ అంతలోనే వర్షం పడడంతో మరలా బరకాలు కప్పుకొని ధాన్యం రాశులను భద్రపర్చుకుం టున్నారు. వికెరాయపురం, బోయినపూడి, మాధవపట్నం తదితర ప్రాంతాల్లో వర్షంతో పనలపై పంట తడిసిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల సూచనలతో మండలంలో ప్రస్తుతం వరి కోతలును రైతులు వాయిదా వేసుకున్నారు. ఇరిగేషన్ అధికారులు, పిబిసి, గోదావరి కాల్వ ద్వారా పంట పొలాలకు వెళ్లే నీటి కాల్వలకు నీటి సరఫరాను నిలుపుదలచేశారు. భీమవరం ప్రాంతంలో పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయి.

కాస్త తెరిపి ఇవ్వడంతో వికె.రాయపురంలో ధాన్యం రాశులపై బరకాలు తొలగిస్తున్న రైతులు

ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేస్తాం

- రైతులు ఎలాంటి ఆందోళనా పడొద్దు • ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఇలాక్కియా

ప్రజాశక్తి -కరప

రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ మద్దతు ధరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని కాకినాడ జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఎస్.ఇలాక్కియా భరోసా ఇచ్చారు. ఉపరితల ద్రోణి ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో వరి పంట పొలాలను, ఆర్‌బికెల ద్వారా జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియతో పాటు కళ్లాలపై ఉన్న ధాన్యాన్ని పరిశీలించేందుకు ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ మంగళవారం కరపలో పర్యటించారు. పెనుగుదురులో వరి పొలా లను, కళ్లాలల్లో ఉన్న ధాన్యపు రాశుల్ని పరిశీ లించి, రైతులతో మాట్లాడారు. రైతులు ఆందోళన చెందన వసరం లేదని రైతుల ధాన్యాన్ని సకాలంలో ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే ఆర్‌బీకేల ద్వారా ఆరు వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు జరిగిందని.. లక్ష్యాలతో సంబంధం లేకుండా బొండాలు రకం ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. బొండాలు రకం ధాన్యం కొనుగోలుకు సంబంధించి వదంతులను నమ్మొద్దని సూచించారు. జిల్లాలో 12 బాయిల్డ్ రైస్ మిల్లులు న్నాయని.. సామర్లకోట, పెదపూడి తదితర మండలాల నుంచి బొండాలు రకం ధాన్యం బాయిల్డ్ మిల్లులకు వస్తున్నాయని తెలిపారు. అధికారులు, ఆర్‌బికె సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి.. రైతులకు అవసరమైన సహాయ సహాకారాలు అందించాలని ఇన్‌ఛార్జ్ కలెక్టర్ తెలిపారు.

పంట పొలాలను పరిశీలించిన అనంతరం పెనుగుదురులో జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష కార్యక్రమంలో భాగంగా సాగుతున్న స్టోన్ ప్లాంటేషన్ పనులను ఇన్‌ఛార్జ్ కలెక్టర్ పరిశీలించారు. లక్ష్యాలకు అనుగుణంగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఇలక్కియ వెంట డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, కరప తహశీల్దారు శ్రీనివాస్, ఎంపిడిఒ కె.స్వప్న జడ్‌పిటిసి వై.సుబ్బారావు ఎంపిపి పి.శ్రీలక్ష్మీ సత్తిబాబు ఉన్నారు.

పెనుగుదురులో రైతులు చూపిస్తున్న ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జ్ కలెక్ట్ ఇలాక్కియా, అధికారులు

జెండా ఆవిష్కరించిన రాజబాబు

ఆనూరులో ఎర్రజెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎపి రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో మేడే వారో త్సవాల్లో భాగంగా మంగళవారం పెద్దాపురం మండలం ఆనూరులోని అల్లూరి సీతారామరాజు నగర్‌లో రైతు కూలీ సంఘం జెండాను సంఘ జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు ఆవిష్కరించారు. సంఘ జిల్లా కార్యదర్శి బి రమేష్, సహాయ కార్యదర్శి కడితే సతీష్,వల్లూరి సత్తిబాబు, సంఘ గ్రామ ప్రెసిడెంట్ నాగరాజు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం పట్టణ పరిధిలోని శ్రీ రాజా వత్సవాయి బుచ్చి సీతయ్యమ్మ సత్రం నూతన ధర్మకర్తల మండలి సభ్యులుగా ఉండటానికి ఆసక్తి కలవారు 20 రోజులలోగా దరఖాస్తు చేసుకోవాలని సత్రం కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ దేవదాయ ధర్మాదాయ శాఖ నియమ నిబంధనలను అనుసరించి ఆసక్తి కలవారు దరఖాస్తు చేసుకోవలసిందిగా ఆయన కోరారు. ఆసక్తి కలవారు తమ దరఖాస్తులను ఉప కమిషనర్ దేవాదాయ ధర్మాదాయ శాఖ కాకినాడ వారికి పంపించాలన్నారు.

ఉప్పంగలలో నీట మునిగిన వరి పనలను చూపుతున్న రైతులు, సర్పంచ్ శంకరుడు

కాజులూరు మండలంలో తడిచిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న వల్లు రాజబాబు

పి. మల్లవరంలో తడిసిన వరి పనలను పరిశీలిస్తున్న మాజీ ఎంఎల్ఎ దాట్ల

వర్షాలతో దెబ్బ తిన్న పంటను

ప్రభుత్వం కొనుగోలు చేయాలి

- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - కాకినాడ

రెండు రోజులనుండి కురుస్తున్న అకాల వర్షాల వల్ల పంట దెబ్బతిన్న ప్రతి గింజ ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం. రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో పెదపూడి, సామర్లకోట, కాజులూరు, పిఠాపురం, గొల్లప్రోలు కొత్తపల్లి మండలాల్లో ఇప్పటికే పంట కోసి, ధాన్యం రాసులు పోసారని, ధాన్యం రాసులు తడిచి నీరు నిల్వ వల్ల మొలక వచ్చే ప్రమాదం ఉందని, అకాల వర్షం వల్ల ప్రతి గింజ ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఇప్పటికే జిల్లాలో బొండాలు ధాన్యం అధికంగా పండించిన రైతులు రేటు లేక నష్ట పోతుంటే, ఈ అకాల వర్షాలతో ప్రైవేట్ ధాన్యం కొనుగోలుదారుల వల్ల మరింత నష్ట పోనున్నారని రాజశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌బికెలు తక్షణం రైతులకు సహకారంగా నిలవాలని ఆ వైపుగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు. వర్షాలు తగ్గిన తరువాత పంట నష్టం నమోదుకు చర్యలు చేపట్టాలని రాజశేఖర్ కోరారు.

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

కాజులూరు మండలంలోని పలు ప్రాంతాల్లో నీట మునిగిన ప్రాంతాల్లో ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబుమంగళవారం పర్యటించారు. వర్షాల వల్ల నష్టపోయిన కౌలు రైతులు, రైతులను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో 15శాతం కోతలు మాత్రమే పూర్తి ఆయ్యాయని మిగతా పంట పొలాలు వరి కోతలు జరగలేదని ఈ వర్షం వల్ల పూర్తిగా మోకాళ్ళ లోతు నీటిలో పొలాలు మునిగి పోయాయన్నారు. . కాగా 75 కేజీలకు ధాన్యానికి రూ.1500 పైబడి ధర ఉందని మిల్లర్లు రూ.1300కే కొనుగోలు చేస్తున్నా రన్నారు. ప్రభుత్వ పర్యవేక్షణ లోపం వల్ల ఐదు ఎకరాలు చేస్తున్న కౌలు రైతుకు రూ.50 వేల మేర నష్టం వస్తుందని అన్నారు. ప్రభుత్వం ఆర్‌బికెల ద్వారా ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని అన్ని విధాల రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో అల్లాడి నరసింహమూర్తి నామాచంద్రరావు సాలాది నారాయణ సోడిశెట్టి శ్రీను నామ సత్తిబాబు సోడిశెట్టి చిన్న యాల ఏడుకొండలు సత్తిబాబు, రైతులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

మాజీ ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు

తాళ్లరేవు : అకాలవర్షాల కారణంగా దెబ్బతిన్న రైతాంగాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మాజీ ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు డిమాండ్ చేశారు. తాళ్ళరేవు మండలం పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది గ్రామంలో వర్షాల కారణంగా పాడైపోయిన వ్యవసాయ పంటలను దాట్ల సుబ్బరాజు తెలుగుదేశం పార్టీ రైతు కమిటీ పరిశీలించారు. అకాల వర్షాలు కారణంగా పాడైపోయిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాలు ద్వారా బేషరతుగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట రాష్ట్ర రైతు ఉపాధ్యక్షులు చెల్లి వివేకానంద, మట్టా ప్రభాకర్, గుత్తులు సాయి, ముమ్మిడివరం రైతు అధ్యక్షులు కాశి, ధూళిపూడి వెంకటరమణ తదితరులు ఉన్నారు.

ఉప్పంగలలో నీట మునిగిన వరి పనలు

అకాల వర్షాలు కురిసిన కారణంగా మండలంలోని ఉప్పంగలలో వరి చేలు మునిగిపోయి, చేతికి వచ్చిన పంట దెబ్బతిందని, ధాన్యం తడిచిపోయిందని రైతులు పితాని సత్యనారాయణ అన్నారు. రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకో వాలని కోరారు. గ్రామ సర్పంచ్ శాఖ శంకరుడు, లచ్చిపాలెం సొసైటీ అధ్యక్షులు దవులూరి శ్రీరామచంద్రమూర్తి, సచివాలయ కన్వీనర్ చెల్లుబోయిన శ్రీనివాస్ పంట పొలాలను పరిశీలించారు. తాళ్ళరేవు, పోలేకుర్రు, పి. మల్లవరం గ్రాంటు, పత్తి గొంది తదితర చోట్ల పంట పొలాలు దెబ్బతిన్నాయి. అకాల వర్షానికి నీట మునిగిన పంట పొలాలకు, తడిసిన ధాన్యానికి ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

10లోగా పెన్షనర్లు ఇకెవైసి చేసుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్రంలో వివిధ ట్రెజరీల ద్వారా పెన్షన్ పొందుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు అందరూ విధిగా ఈ నెల10వ తేదీ లోపు ఈకెవైసి పూర్తి చేసుకోవాలని ఎపిఆర్‌పిఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు తెలియజేశారు. మంగళవారం కాకినాడ జిల్లా ఖజానా అధికారి ఎన్. శ్రీనివాసులును కలిసిన ఎపిఆర్‌పిఎ జిల్లా ప్రతినిది బృందం పెన్షనర్ల సమస్యలపై చర్చించింది. ఈ సందర్భంగా జిల్లా ఖజానా అధికారి ఎం శ్రీనివాసులు మాట్లాడుతూ పెన్షనర్లకు చెల్లించే పెన్షన్ ఇతర ఎరియర్లు చెల్లించుటకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అందరూ పెన్షనర్లు తమ ఆధార్ కార్డు నెంబర్‌తో ఈకెవైసి ఈనెల 10 అద్వ తేదీ లోపు పూర్తి చేసుకోవాలని పైఅధికారుల ఆదేశాల మేరకు అందరు పెన్షనర్లకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో అన్ని సబ్ ట్రెజరీల పరిధిలో ఈకెవైసి సదుపాయం ఉండటంతో పెన్షనర్లు అందరూ సంబంధిత సబ్ ట్రెజరీలకు వెళ్లి ఈకెవైసి పూర్తి చేసుకోవాలని కోరారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వెంటనే పరిష్కరిస్తామని జిల్లా ఖజనాధికారి తెలియజేశారు. అదేవిధంగా కాకినాడ యుటిఎఫ్ కార్యాలయంలో ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటల నుండి ఏడు గంటల వరకు ఎపిఆర్‌పిఎ ఆధ్వర్యంలో ఈకెవైసి చేయనున్నట్లు తెలియజేశారు. పెన్షనర్లు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కె.సత్తిరాజు తెలియజేశారు. ప్రతినిధి బృందంలో జోగా అప్పారావు, పి మోహన మురళి, ఎస్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **పిఠాపురం:** రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు నియోజవర్గం పరిధిలో ఉన్న సర్వీస్ పెన్షనర్లు వారి కుటుంబ సభ్యులు ఈ నెల 10 లోపు ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని పిఠాపురం సబ్ ట్రెజరీ అధికారి ఎండి అహ్మద్ వల్లి ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 1081 సర్వీస్ పెన్షనర్లు ఉండగా ఇప్పటివరకు 465 మంది ఈకెవైసి చేయించుకు న్నారని మిగిలినవారు ఈ నెల 10 లోపు తప్పనిసరిగా ఈకెవైసి చేయించుకోవాలని ఎస్‌టిఒ తెలిపారు.

శ్రీబాంధవిని అభినందిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప

స్టేట్ ఫస్ట్ విద్యార్థినికి ఎంఎల్ఎ చినరాజప్ప అభినందన

ప్రజాశక్తి - పెద్దాపురం

ఇంటర్ పరీక్షల్లో సామర్లకోట ప్రగతి కళాశాలలో చదివి స్టేట్ ఫస్ట్ సాధించిన పెద్దాపురానికి చెందిన విద్యార్థిని కె శ్రీబాంధవిని స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం ఎంఎల్ఎ నిమ్మకాయల చిన రాజప్ప అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఎలి శెట్టి నాని, మేడిది శ్రీనివాస్, చాగంటి గోపాలకృష్ణ, బుజ్జి పాల్గొన్నారు.

వైయస్సార్ బీమా అందజేత

ప్రజాశక్తి- తాళ్లరేవు

తాళ్ళరేవు మండలం పోలేకుర్రులో ఇటీవల అనారోగ్యంతో అర్థాకుల గుర్రాజు (42) మరణించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నుండి రూ.10 వేలు తక్షణ సహాయంగా వైయస్సార్ బీమా మంజూరయింది. మంజూరైన వైఎస్ఆర్ బీమా తక్షణ సహాయంగా రూ.10 వేలను మంగళవారం గ్రామ సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, ఎంపిటిసి దడాల సంధ్యారాణి, కార్యదర్శి జ్యోతిసుధ, సచివాలయం కార్యదర్శి వినాయక కుమార్‌లు బాధజత కుటుంబానికి అందజేశారు.

బీమా చెక్కు అందిస్తున్న అధికారులు

కార్టూ'నిజం'

గంజాయి కేసులో మనవాడు పట్టుబడ్డాడు సార్..!!

ప్రత్తిపాడు కోర్టు ఆవరణలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

న్యాయవాదిపై దాడికి నిరసన

ప్రజాశక్తి - ఏలేశ్వరం

జిల్లా కోర్టు ఆవరణలోనే ప్రతివాదులు, వారి మనుషులు ప్రతిపాడు న్యాయవాది యార్లగడ్డ శ్రీనివాసరావుపై దాడి చేయడం నిరసిస్తూ కోర్టు ఆవరణలో న్యాయవాదులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టంశెట్టి పుల్లయ్య మాట్లాడుతూ న్యాయవాదిపై దాడి చేసిన వారిని పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకుని ఎఫ్ఐఆర్ బుక్ చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు రక్షణకు ప్రత్యేక చట్టాన్ని వెంటనే తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి బొంగులూరి మధుబాబు, ఉపాధ్యక్షులు మళ్ల గంగాధర్, కోశాధికారి జొన్నాడ రాజేష్, సహాయం కార్యదర్శి రాయి శ్రీనివాసరావు, స్పోర్ట్స్ కార్యదర్శి శివకుమార్, సీనియర్ న్యాయవాదులు చెల్లంకూరి రామకష్ణ, కొల్ల వీర్రాజు, ఏ కుక్కుటేశ్వరరావు, పిల్లి బలరాముడు, బాధ జాన్ బాబు, రాజాల చిట్టిబాబు, లేడీ రిప్రజెంటేటివ్ పి మంజుష, పలివేల నాగేంద్ర, యార్లగడ్డ శ్రీనివాసరావు, అచ్యుత రామారావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు సహరించాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మిల్లర్లు ధాన్యం కొనుగోలుకు సహకరించాలని ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఎంపిడిఒ డి.శ్రీలలిత, తహశీల్దార్ లక్ష్మీ నరసకుమారి పిలుపునిచ్చారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో మిల్లర్లతో ధాన్యం సేకరణ పై అవగాహనా సదస్సు నిర్వహించారు. మిల్లర్లు నష్ట పోకుండా, రైతులకు అనుకూలంగా ప్రభుత్వ సూచనలను అనుసరించి సహకరించాలని సూచించారు. ధాన్యం బ్రోకెన్ శాతం 30 శాతం దాటితే తప్ప ఎవ్వరికి తగ్గుదల లేకుండా చూడ వలసిందిగా కోరారు. మిల్లు వద్దకు వచ్చిన పంటని త్వరి తగతిన బాయిల్డు రైసు కోసం అప్‌లోడ్ చేయాలని, కటింగ్ చేసి నేరుగా పంపిన పంటని ఎటువంటి కోత లేకుండా తీసుకోవలసినదిగా అవగాహన కల్పించారు. సమావేశంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, ఎడిఎలు జివి పద్మశ్రీ, ప్రత్యేకా ధికారి పివసంతమాధవతి, ఎఒ ఇమ్మిడిశెట్టి సత్య, ఐ.సత్య, మండల పరిధిలోని మిల్లర్లు, విఆర్‌ఒలు హాజరయ్యారు.

మిల్లర్లతో సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ప్రఖర్‌జైన్‌కు స్వాగతం పలుకుతున్న కార్యాలయ సిబ్బంది

ఎంపిడిఒ కార్యాలయంలో

ట్రైనీ కలెక్టర్ ప్రఖర్ జైన్‌కు శిక్షణ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట ఎంపిడిఒ కార్యాలయంలో వారం రోజులపాటు ఇన్‌డక్షన్ ట్రైనింగ్ నిమిత్తం మంగళవారం సాయంత్రం ట్రైనీ కలెక్టర్ ప్రఖార్ జైన్, ఐఎఎస్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఎంపిడిఒ డి శ్రీలలిత, కార్యాలయం ఎవో విప్పర్తి వీర సాయిబాబు,ఇన్‌చార్జి ఇవోపిఆర్డీ వై శ్రీహరి, కార్యాలయం సిబ్బంది మొక్కను అందజేసి స్వాగతం పలికారు. మండల పరిషత్ కార్యాలయం విధులు, అధికారాలు, గ్రాంటుల వివరాలు, ఎంపిటిసి సభ్యుల ఎన్నిక ప్రక్రియ, పలు శాఖలతో సమన్వయ్యం, ఎస్‌డబ్ల్యూపిసి షెడ్ల నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ తీసుకుంటారని ఎంపిడిఒ వివరించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

దోపిడీ దొంగల అరెస్టు గంటల వ్యవధిలో చోరీ సొత్తు రికవరీ

ప్రజాశక్తి - కాకినాడ క్రైమ్

కాకినాడ : వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న ఆరుగురు దోపిడీ దొంగలను పోలీసులు అరెస్ట్ చేసి చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఘటన జరిగిన గంటల వ్యవధిలోనే కేసులు చేధించినట్టు జిల్లా ఎస్పి ఎస్.సతీష్ కుమార్ వెల్లడించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ కాకినాడ రూరల్ ఇంద్రపాలెం, పిఠాపురం సర్కిల్ గొల్లప్రోలులో జరిగిన నేరాలలో ఆరుగురు దొంగలను అరెస్ట్ చేసి రూ.5,78,875ల విలువ గల 207 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2,81,820ల విలువ గల వెండి వస్తువులు, 30 వేలు విలువ గల సెల్ ఫోన్ మొత్తం రూ.8,90,695ల విలువైన వస్తువులు రికవరీ చేసినట్టు తెలిపారు. ఇంద్రపాలెం కేసులో ముగ్గురు ముద్దాయిలు మల్లాడి ప్రసాద్(24), దొక్కా మహేష్(25), పెసంగి ప్రసాద్ (24), అలాగే గొల్లప్రోలు కేసులో మానిపాటి విజయ్ కుమార్(23), నడిపూడి మధుఏమాళవిక (20) (ట్రాన్స్జెండర్), కర్రి మూర్తిఏపద్మ(19) (ట్రాన్స్జెండర్) ఉన్నారన్నారు. ఈ సందర్భంగా కేసులను గంటల వ్యవధిలోనే చేధించిన కాకినాడ ఎస్డిపిఒ పి.మురళీ కృష్ణా రెడ్డి, పిఠాపురం సిఐ వైఆర్కె. శ్రీనివాస్, ఎస్ఐ, సిబ్బంది, ఇంద్రపాలెం సిసిఎస్ సిఐ పివిఆర్ మూర్తి, సిబ్బందిని ప్రశంసించి ప్రశంసాపత్రం, నగదు పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి పి.శ్రీనివాస్, సిసిఎస్, ఎస్బి డిఎస్పిలు సిబ్బంది పాల్గొన్నారు.

రైలుపై రాళ్ల దాడి కేసులో ఆరుగురి అరెస్టు

ప్రజాశక్తి - సామర్లకోట

ఏప్రిల్ 28వ తేదీన పిఠాపురం సామర్లకోట రైల్వే స్టేషన్ మధ్యలో వందే భారత్ రైలు పై రాళ్ల దాడి చేసిన ఘటనలో ఆరుగురు వ్యక్తులను మంగళవారం సాయంత్రం అరెస్టు చేసినట్టు సామర్లకోట రైల్వే పోలీసులు తెలిపారు. సామర్లకోటకు చెందిన 6గురు వ్యక్తులు వందే భారత్ రైలు పై రాళ్ల దాడి చేయడంతో వందే భారత్ రైల్లోని సి-11 కోచ్ కిటికీ అద్దాలు ధ్వంసం అవడంపై రాజమండ్రి రైల్వే ఇన్స్పెక్టర్ బి.సైదయ్య కేసు నమోదు చేశారు. దీనిపై సామర్లకోట జిఆర్పి ఎస్ఐ బి.లోవరాజు ఆర్పిఎఫ్ ఎస్ఐ డీ రామారావు సంయుక్త గా విచారణ చేయడం చేశారు. సిసి కెమెరాల ఆధారంగా సామర్లకోటకు చెందిన ఆరుగురు వ్యక్తులను గుర్తించి వారిని విజయవాడ రైల్వే కోర్టుకు తరలించినట్టు తెలిపారు.

చేపలు దొంగిలించిన వ్యక్తులపై కేసు

ప్రజాశక్తి-గోపాలపురం

మండలంలోని రాజంపాలెం పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న దొమ్మర గొయ్యి చెరువులో చేపలు దొంగిలించారంటు ఫిర్యాదు పై ఎస్ఐ రామకష్ణ మంగళవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రాజంపాలెం గ్రామంలో పంచాయతీ సమీపంలో ఆర్ఎస్ నెంబర్ 11 లో 1.44 ఎకరాలు విస్తీర్ణంలో మంగళవారం అదే గ్రామానికి చెందిన అయిదుగురు వ్యక్తులు అనధికారంగా చెరువులో చేపలు పట్టి తరలించారు. అనధికారంగా పట్టి తరలించిన చేపలు విలువ సుమారు రూ.80 వేలు ఉంటాయని ఇంఛార్జి కార్యదర్శి కెఎస్వి.అనురాధ తెలిపారు. దీనిపై ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన అయిదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మొబైల్ ఫోన్, ల్యాప్టాప్ చోరీపై కేసు

ప్రజాశక్తి-గోపాలపురం

ఇంట్లో పెట్టిన ల్యాప్ టాప్, మొబైల్ ఫోన్ కనిపించకపోవడంతో బాధితుడు ఫిర్యాదు పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకష్ణ తెలిపారు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోపాలపురం గ్రామానికి చెందిన వేసంగి సాయి చంద్ర వర్క్ ఫర్ హెూమ్ లో భాగంగా గత నెల 30వ తేదీన తన లాప్ టాప్ లో వర్క్ చేసుకున్నాడు. అయితే ఉదయాన్నే చూడగా తన ల్యాప్ టాప్, మొబైల్ ఫోన్ కనిపించకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించినట్లు దీనిపై మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టిడిపి నేతల ప్రత్యేక ప్రార్థలు

ప్రజాశక్తి-దేవరపల్లి

మండలంలోని గౌరీపట్నం మేరీ మాత ఆలయంలో మంగళవారం తెలుగుదేశం పార్టీ నేతలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ నెల 27, 28 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరగనున్న టిడిపి మహానాడు కార్యక్రమం విజయవంతం అవ్వాలని మాజీ మంత్రి జవహర్ ఆధ్వర్యాన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి అవ్వాలని, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

నియామక పత్రాల అందజేత

ప్రజాశక్తి-దేవరపల్లి

దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయం వద్ద నల్లజర్ల, గోపాలపురం మండలాలకు సంబంధించిన 12 మంది అంగన్వాడీ ఆయా వర్కర్లకు ఎంఎల్ఎ తలారి వెంకట్రావు మంగళవారం నియామక పత్రాలు అందించారు. అంగన్వాడీలు, ఆయాలు విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

యానాం వార్తలు

విద్యార్థి శర్మను సత్కరించిన ఆర్ఏఓ మునిస్వామి

విద్యార్థి శర్మకు ఆర్ఎఒ అభినందనలు

ప్రజాశక్తి - యానాం

యానాం గోపాల్ నగర్ కు చెందిన ఇంటర్ విద్యార్థి కెఎస్ఎస్ఎస్ శర్మను యానాం ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి అభినందించారు. ఇటీవల విడుదలైన పరీక్షా ఫలితాలలో కాకినాడ నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న శర్మ సీనియర్ బైపిసిలో అత్యధికంగా 981 మార్కులు సాధించాడు. ఈమేరకు మంగళవారం ఆర్ఎఒ మునిస్వామిని విద్యార్థి, అతని తల్లిదండ్రులు కలిశారు. ఈ సందర్భంగా శర్మను ఆర్ఎఒ మునిస్వామి శాలువాతో సత్కరించి అభినందించారు.

పాము కాటుకు గురై ఉపాధి కూలి మృతి

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

పాము కాటుకు మరణించిన ఉపాధి కూలీ వరలక్ష్మి

సామర్లకోట మండలం జి.మేడ పాడు గ్రామంలో సీతారాముడు చెరువులో ఉపాధి పనులు చేసేందుకు వెళ్లిన బొల్లి రెడ్డి వరలక్ష్మి (71) మంగళవారం ఉదయం పాము కాటు గురై మృతిచెందింది. మంగళవారం గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులకు హాజరై పనులు చేస్తుండగా పాము కాటు వేయడంతో ఆమె మృతి చెందింది. 108 వచ్చేసరికి ఆమె మరణించింద న్నారు. రోజు తమతో ఉపాధి పనులు హాజరయ్యే వరలక్ష్మి మతి చెందడం పట్ల తోటి కూలీలు విచారం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ ఎఇ వీర్రాజు తెలిపిన సమాచారం ప్రకారం, విఆర్ఒ పంచనామా నిర్వహించి ఫోటోలను, సంబంధించిన పత్రాలను ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు.

డిఒఎంపై నూతన ఎంపిడిఒలకు శిక్షణ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నూతనంగా నియమితులైన సుమారు 34 మంది ఎంపిడిఒలకు సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలో రెండో రోజు మంగళవారం శిక్షణలో భాగంగా డిఒఎం జిల్లా కార్యాలయం మాన్యువల్ అంశంపై శిక్షణను ప్రారంభించారు. జాతీయ స్థాయి శిక్షణ పొందిన టి.మల్లిఖార్జునరావు శిక్షణ ప్రారంభించారు. సామర్లకోట ఇటిసిలో ఇచ్చే నెల రోజుల శిక్షణలో భాగంగా 12 రోజులపాటు డిఒఎం అంశంపై శిక్షణలు ఇవ్వనున్నట్లు చెప్పారు. విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ జే వేణుగోపాల్ ఆధ్వర్యంలో సోమవారం శిక్షణా తరగతులు ప్రారంభించారు. ప్రభుత్వ ఉద్యోగులు కార్యాలయాల్లో పనులు ఎలా నిర్వహించాలి, ఫైల్స్ ఎలా పూర్తి చెయ్యాలన్న అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఇటిసి ప్యాకల్టీ మెంబర్ పి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, చీఫ్ ఇన్స్ట్రక్టర్ జి.శ్రీదేవి, ప్యాకల్టీ మెంబర్ ఎంఎస్ఎన్ రెడ్డి, బి వెంక టేశ్వరరావు, బి.ఆంజనేయులు, వి.ప్రసాద్, కెఆర్ నిహారికలు పాల్గొని శిక్షణ ఇచ్చారు.

బొడ్డు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వెంకటరమణ చౌదరి

మాజీ ఎంఎల్ఎ బొడ్డుకు నివాళి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

పెద్దాపురం మాజీ ఎంఎల్ఎ, మాజీ ఎంఎల్సి కి.శే బొడ్డు భాస్కర రామారావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా మండలంలోని వేట్లపాలెం, జి.మేడపాడు గ్రామాల్లో ఘనంగా నివాళులర్పించారు. బొడ్డు తనయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరి తన తండ్రి కీ.శే బొడ్డు భాస్కరరామారావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో వేట్లపాలెం మాజీ ఉప సర్పంచ్ గోలి వెంకట్రావు, ప్రస్తుత ఉప సర్పంచ్ గోలి శ్రీరామ్ చౌదరి, వేట్ల పాలెం నాయకులు గుమ్మళ్ళ రాజు, కంటిపూటి సత్యనారాయణ, నున్న గొల్లబ్బాయి, వల్లూరి వెంకట్రావు, అమటం వెంకటేశ్వరరావు, పాలచర్ల సతీష్ కుమార్, జి.మేడపాడు నాయకులు నున్న సుధాకర్, పుట్టా రాంబాబు, మాసిన సూరిబాబు, పాలకుర్తి రవిబాబు, కంచుమర్తి వీర్రాజు పాల్గొన్నారు.

స్నాతకోత్సవానికి సహకరించాలి

జెఎన్టియుకె విసి ప్రసాద్ రాజు

ప్రజాశక్తి - కాకినాడ

స్నాతకోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని జెఎన్టియుకె విసి జివిఆర్ ప్రసాదరాజు విజ్ఞప్తి చేశారు. జెఎన్ యుకె ప్రాంగణంలో మంగళవారం అలూమ్ని హాలులో నేషనల్ అసెస్మెంట్, అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) టీమ్ పర్యటన, స్నాతకోత్సవ ఏర్పాట్లపై విసి ప్రసాదరాజు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ నెల 9, 10, 11 తేదీలలో న్యాక్ టీమ్ యూనివర్శిటీని సందర్శించనున్న నేపథ్యంలో యుసిఇకె, యూనివర్శిటీలోని విభాగాలకు సంబంధించి చేపట్టాల్సిన డాక్యుమెంటేషన్, తదితర పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. న్యాక్ టీమ్ సందర్శనలో భాగంగా ఆయా రోజులలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ప్రతీ ఒక్కరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. యూనివర్శిటీ, యుసిఇకె కళాశాలకు చెందిన విభాగాలు, ప్రయోగశాలలను మరింత శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. యూనివర్శిటీకి మెరుగైన న్యాక్ గ్రేడ్ లభించేలా ప్రతీ ఒక్కరు తమ వంతు సహకారం అందించాలన్నారు. జెఎన్ టియుకె యూనివర్శిటీ 9వ స్నాతకోత్సవాన్ని ఈ నెల 31వ తేదీన నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వేడుకలకు విశ్వవిద్యా లయ కులపతి, ఛాన్సలర్ ఎస్. అబ్దుల్ నజీర్ ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో రిజిస్ట్రార్ ఎల్. సుమలత, డైరెక్టర్లు, స్పెషల్ ఆఫీసర్లు, యుసిఇకె ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్ను సన్మానిస్తున్న దృశ్యం

మేజిస్ట్రేట్ సుధాకర్ ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలోని న్యాయస్థానాల సముదాయం లో మేజిస్ట్రేట్ గా పనిచేసిన దొమ్మేటి సుధాకర్ ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం ఆయనకు ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా మేజిస్ట్రేట్ మాట్లాడుతూ తాను పని చేసిన కాలంలో న్యాయవాదులు ఎంతగానో బెంచికి సహకరిం చార న్నారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళి ఆయనకు దుశ్శాలువా కప్పి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వాడ్రేవు సాయి ప్రసాద్, కార్యవర్గం చక్రవర్తి, పద్మీ, సత్యవాణి, న్యాయవాదులు బినయ్ బాబు, జయశంకర్, కెవివి.సత్య నారాయణ, సూరంపూడి గంగాధర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

పంట చేతికి అంది వచ్చే సమయంలో కురిసిన అకాల వర్షం వల్ల తడిచిన ధాన్యంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి కోరారు. మంగళవారం మండలంలోని పాలంగి, ఉండ్రాజవరం తదితర గ్రామాల్లో ఆమె తడిసిన వరి చేలను పరిశీలించారు. తడిచిన ధాన్యాన్ని పరీక్షించారు. అనంతరం రైతులకు న్యాయం జరిగేలా ఆదుకోవాలని నిడదవోలు ఎంఎల్ఎ జి.శ్రీనివాస్ నాయుడు, అధికారులకు నివేదిక అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలంగి సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, వైసిపి నాయకులు పాలాటి శరత్ బాబు, రైతులు, విఆర్ఒ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమతులాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి - కాకినాడరూరల్

మనం తీసుకునే ఆహారంలో ఎల్లప్పుడు సమతుల్యత పాటిస్తే ఆరోగ్యంగా జీవించవచ్చని పోషకాహారం నిపుణులు పి.పార్థసారథి సూచించారు. సర్పవరం జంక్షన్లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మనం తీసుకునే ఆహారంలో సమతుల్యత దెబ్బతింటే మధుమేహం, అధిక రక్తపోటు, స్థూల కాయం వంటి దీర్ఘకాలిక రోగాలకు బలవుతామని అన్నారు. మనం తీసుకునే ఆహారంలో ప్రోటీన్లు, పీచు పదార్థాలు, విటమిన్లు, ఖనిజాలు, కొవ్వు పదార్థాలు, పిండి పదార్థాలు అవసరమన్నారు. దీనికి గాను మూడు బియ్యం, రాగులు, సజ్జలు, పాలు, చేపలు, ఆకుకూరలు, పండ్లు, తృణధాన్యాలు, మాంసాహారం, పప్పు ధాన్యాలు వంటివి తీసుకుంటూ క్రమబద్ధంగా వ్యాయామం చేయాలని పార్థసారథి తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, ఓం నమశ్శివాయ తదితరులు పాల్గొన్నారు.

కార్టూనిస్ట్ రాముకి విశిష్ట బహుమతి

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

బహుమతి పొందిన కార్టూన్

బండారులంక గ్రామానికి చెందిన ప్రముఖ కార్టూనిస్ట్ మాడా రాము గీసిన వ్యంగ్య చిత్రం విశిష్ట బహుమతికి ఎంపికైంది. ఈ విషయాన్ని మంగళవారం ఆయన విలేకరులకు తెలియజేశారు. మొదటి తెలుగు వ్యంగ్య చిత్రకారుడు తవిశెట్టి రామారావు జయంతిని పురస్కరి ంచుకొని తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం సందర్భంగా హాస్యనందనం మాసపత్రిక ఇటీవల నిర్వహించిన తవిశెట్టి రామారావు రాష్ట్రస్థాయి కార్టూన్స్ పోటీలు-2023లో ఈ బహుమతికి ఎంపికైనట్లు హాస్యనందనం మాస పత్రిక సంపాదకుని ద్వారా రాము తెలుసుకున్నారు. పోటీకి వచ్చిన 400 కార్టూన్లలో ఎంపిక చేసిన 25 ప్రత్యేక కార్టూన్లలో రాము కార్టూన్ ఒకటి కావడం విశేషం. మే 20న హైదరాబాద్లో జరగబోయే తెలుగు కార్టూనిస్టుల దినోత్సవ సభలో సినీ నటులు తనికెళ్ల భరణి ఎల్ బి శ్రీరామ్, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి.రమణ తదితర ప్రముఖుల విశిష్ట బహుమతి పురస్కార సత్కారాన్ని కార్టూనిస్ట్ రాము అందుకోనున్నారు. ఈ సందర్భంగా రాముని పలువురు అభినందించారు.

మాట్లాడుతున్న డాక్టర్ అడ్డాల సత్యనారాయణ

నోటి పరిశుభ్రత ముఖ్యం

ప్రజాశక్తి - కాకినాడరూరల్

సరైన నోటి పరిశుభ్రత విధానాలను అనుసరించడం వలన జీవితాంతం సహజ దంతాలను కాపాడుకోవచ్చని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. సర్పవరం జంక్షన్ లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. దంతాలను సరైన విధానంలో శుభ్రపరచకపోతే ఆహారకణాలు నోటిలోనే మిగిలిపోయి దుర్వాసన వస్తుందన్నారు. అతి వేడి, అతి చల్లని పదార్థాలు తీసుకోవడం వలన దంతాలపై ఉండే ఎనామిల్ దెబ్బతింటుందని అన్నారు. బలంగా ఫ్రెష్ చేసినా ఎనామిల్ దెబ్బతింటుందని అన్నారు. దీని నివారణకు గాను మృదు వైన టూత్ బ్రష్ తో దంతాలను శుభ్రపరచాలని డాక్టర్ అడ్డాల తెలిపారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, ఎస్ .శ్రీనగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 94432
కాకినాడ, కోనసీమ జిల్లాల సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99189

ఉచిత యోగా, చెస్ శిక్షణ

ప్రజాశక్తి-నల్లజర్ల

విద్యార్థులకు ఉచిత యోగా, చెస్ వేసవి శిక్షణ తరగతులు మూడవ తేదీ నుండి ప్రారంభం కానున్నట్లు లయన్స్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస రావు తెలిపారు. ఉదయం 6 నుండి 7 గంటల వరకు యోగ 7 గంటల నుంచి 8 గంటల వరకు చెస్ ప్రముఖ యోగాసనాచార్యులు యోగ రాజారావుచే నిర్వహి స్తారన్నారు. లయన్స్ క్లబ్ దూబచర్ల, పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ అఫ్ ఎపి సహకారంతో సంఘమిత్ర విద్యాలయంలో ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా సత్యదేవుని గ్రామోత్సవం

ప్రజాశక్తి - అన్నవరం

కొండ దిగున స్వామి అమ్మ వార్లను రావణబ్రహ్మ వాహనంపై ఊరేగిస్తున్న అధికారులు

రత్నగిరి శ్రీ వీర వేంకట సత్య నారాయణ స్వామివారి వార్షిక కళ్యాణోత్సవాలలో భాగంగా మూడవ రోజైన మంగళవారం వధూవరులైన స్వామి, అమ్మవార్లకు సాంప్రదాయ బద్ధంగా అరుంధతీ నక్షత్ర దర్శనం గావించారు. ప్రధానాలయంలో ప్రత్యేక పూజలు చేపట్టిన సాయంత్రం 5 గంటలకు దర్బారు మండపంలో స్థాలీపాక ప్రదాన ప్రవేశ హెూమం తంతు ఋత్వికులు నిర్వహించారు. అనంతరం రాత్రి 7 గంట లకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను మంగళ వాయి ద్యా లతో నడుమ వధూవరులకు అరుంధతీ నక్షత్ర దర్శనం గావించారు. శ్రీ సత్యదేవుని కళ్యాణోత్సవాలలో భాగంగా మంగళవారం కొండ దిగువ శ్రీ సత్య దేవుడు, అనంతలక్ష్మీ అమ్మవారు రావణ వాహనంపై ఊరేగింపు కార్యక్రమాన్ని రాత్రి 8 గంటలకు ఇఒ చంద్రశేఖర్ ఆజాద్ ప్రారంభించారు. కోలాటాలు, విచిత్రవేషధారణలు, తప్పెట గుళ్ళ తదితర కార్యక్రమాల నడుమ స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం గ్రామస్తులు, యాత్రికులు వీక్షిస్తుండగా వైభవంగా సాగింది. కార్యమంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో జిల్లాకు రెండో స్థానం

ప్రజాశక్తి - పిఠాపురం

కర్నూలులో ఏప్రిల్ 30 నుండి ఈనెల 1 వరకు రెండు రోజులపాటు జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాయ్స్ రగ్బీ పోటీలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ క్రీడాకారులు రెండో స్థానంలో నిలిచారని జిల్లా కోచ్ పి.లక్ష్మణరావు మంగళవారం తెలిపారు. రెండో స్థానంలో నిలిచిన జట్టును, జిల్లా టీంకు కోచ్ మేనేజర్గా వ్యవహరించిన సాయి వంశీలను జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్ర కుమార్, ఉపాధ్యక్షులు కేతవరపు కృష్ణ, సిఇఒ కె.నాగ లింగేశ్వ రరావు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి కె.పద్మనాభంలు అభినందించారు.

రగ్బీ పోటీలలో ద్వితీయ స్థానం సాధించిన జిల్లా జట్టు

గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా

మాట్లాడుతున్న ఎస్పి సతీష్ కుమార్

ప్రజాశక్తి - పెద్దాపురం

జిల్లాలో గంజాయి నిరోధానికి సంబంధించి స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్తో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పి కె.సతీష్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన పెద్దాపురం పోలీస్ స్టేషన్ సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒడిసా నుండి రవాణా జరిగే గంజాయి తూర్పుగోదావరి మీదుగానే తరలిస్తున్నారన్నారు. ఈ ప్రత్యేక నిఘా, తనిఖీలవల్ల గతంలో కంటే గంజాయి రవాణా బాగా తగ్గిందన్నారు. అలాగే నివాస ప్రాంతాలలో, విద్యా సంస్థల వద్ద గంజాయిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. జిల్లా వ్యాప్తంగా గంజాయిని పూర్తి స్థాయిలో నిరోధించేందుకు చేపట్టిన చర్యలు సత్ఫలితాలి స్తున్నా యన్నారు. గంజాయి గురించి సమాచారం తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందిస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సమావేశంలో పెద్దాపురం సిఐ షేక్ అబ్దుల్ నబీ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - కాజులూరు

ఆర్యవైశ్య సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఆర్యవైశ్య సంఘ నేత కంచర్ల చిన్న వీరభద్రరావు కోరారు . మంగళవారం మండలంలోని కోలంక బొడ్డు నారాయణ స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ మే 7వ తేదీన రాజమహేంద్రవరం మంజీరా కన్వెన్షన్ హాల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రామ స్థాయి నుండి ఆర్యవైశ్యులను చైతన్య పరచడమే ధ్యేయంగా ఈ సమ్మేళనానికి ఆర్య వైశ్యులందరూ హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వాసవి సేవాదళ్ వాకచర్ల గుప్తా, నాళం కిట్టు, కంచర్ల వివి ప్రసాద్ నాళం చిన్ని, వరద వెంకటేశ్వరరావు, గొల్లపూడి చిన్ని కార్యదర్శి మల్లేశ్వరరావు, బొడ్డు చంద్రశేఖర్, పచ్చిపులుసు సూర్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న జిల్లా కార్యదర్శి చిన్న భద్ర రావు, సంఘ సభ్యులు

వివాహిత హత్య కేసులో నిందితుని అరెస్ట్

ప్రజాశక్తి- కొత్తపేట

వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

వివాహిత హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కొత్తపేట డిఎస్పి కెవి.రమణ స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మంగళవారం తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం గత నెల 22న మండలంలోని వానపల్లి గ్రామం ఇందిరా నగర్కు చెందిన పాము కాసు తన భార్య లక్ష్మిని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి బండారు గంగరాజు కు చెందిన కొబ్బరి తోటలో ఉన్న మోటారు బావిలో పడవేసినట్లుగా ఫిర్యాదు చేశాడు. దీనిపై కొత్తపేట పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. రావులపాలెం సిఐ రజిని కుమార్ తన సిబ్బందితో ఈ కేసులోని అనుమానితుడైన వాడపాలెం గ్రామానికి చెందిన మీసాల యేసును విచారించారు. యేసు ఈ కేసులో చనిపోయిన పాము లక్ష్మితో పదేళ్లగా వివాహేతర సంబంధం కలిగి ఉన్నట్లు గుర్తించారు. ఆమెకు ఆర్థికంగా అతడు సహాయం చేస్తూ ఉన్నట్లు, ఈ మధ్యకాలంలో ఆమె ఎక్కువగా ఫోన్లు మాట్లాడుతూ వేరే వాళ్లతో చనువుగా ఉండటతో, తన మాట వినకపోవడంతో యేసు ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. దీంతో ఆమెని చంపాలని నిర్ణయించుకున్నాడు. అయితే ముందుగా అతను వేసుకున్న పథకం ప్రకారం యేసు గేదెలపాక వద్ద గల అరటి తోటలోనికి ఆమెను పిలిచి తనతో తెచ్చుకున్న తాడుతో పాము లక్ష్మి పీకకు చుట్టి హతమార్చాడు. అపంతరం తనపై ఎవరికి అనుమానం లేకుండా ఉండేందుకు పాము లక్ష్మి మృతదేహాన్ని తీసుకుని వెళ్లి బండారు గంగరాజుకు చెందిన మోటార్ బావిలో పడవేసి,అనుమానం రాకుండా బావి పై సిమెంటు ప్లేట్లుతో మూసి వేసినట్లు గుర్తించారు. ఆ మేరకు అతనిని అరెస్ట్ చేసి, హత్యకు అతను ఉపయోగించిన తాడుని నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో రావులపాలెం సిఐ రజిని కుమార్, కొత్తపేట ఎస్ఐ వి.మణికుమార్ పాల్గొన్నారు.

ఆదిరెడ్డి అరెస్ట్కు ఖండన

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

ఆదిరెడ్డి అప్పారావు, వాసుల అరెస్టును టిడిపి ఎస్సి ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పొలమూరి ధర్మపాల్ మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపిని బలహీన పరచాలనే పథకం లో భాగంగానే వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపడుతుందని అన్నారు.. తక్షణమే తప్పుడు కేసులు ఎత్తేసి ఆదిరెడ్డి ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వంశపారంపర్యంగా ఆస్తమా

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ కుమార్యాదవ్

ఆస్మా వ్యాధి అలర్జీకి సంబంధించిన వ్యాధి అని ఇది వంశపారంపర్యంగా వచ్చే అవకాశం ఉందని డాక్టర్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆస్మావ్యాధి నివారణ దినోత్సవం పురస్కరించుకుని జరిగిన ఉచిత వైద్య శిబిరాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మురికివాడలోను, పారిశ్రామిక ప్రాంతాల్లో పర్యావరణ పరిస్థితులు సక్రమంగా లేని చోట ఆస్మా వేగంగా వ్యాపిస్తుందన్నారు. దుమ్ము, ధూళి ,సిగరెట్ తాగడం, వైరల్ ఇన్ఫెక్షన్లు, హఠాత్తుగా వాతావరణం లో మార్పులు ఆస్తమాను పెంచుతాయని అన్నారు. శ్వాసను ఏమాత్రం అందజేయకుండా ఈ వ్యాధి వేధించడం ప్రధాన లక్షణమని అన్నారు. ఊపిరితిత్తుల్లో ఉండే గాలి గదులకు గాలిని చేర్చే గొట్టాలకు లోపలి వైపున పొర ఉంటుందని ఆ పొరగాని, గాలి గొట్టం గానీ ముడుచుకుపోతే శ్వాసకు అవరోధం ఏర్పడుతుందని డాక్టర్ యాదవ్ తెలిపారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

సప్లమెంటరీ పరీక్షలకు శిక్షణ

ప్రజాశక్తి-మండపేట

స్థానిక ఎస్వీఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలకు సంబంధించి విద్యార్థులకు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ అత్తిలి శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 20వ తేదీ వరకు జరిగే ఈ తరగతులను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు.

IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE; CITY CIVIL COURT AT HYDERABAD.

O.S.No.1688 Of 2021

Between:
Union Bank of India,
[A Govt. of India undertaking]
[formerly]Andra Bank rep.by Manager,
Credit Card Division Head Office,
Koti, Sultan Bazar, Hyderabad.
...Plaintiff.

AND

Mr.G.Sudheer Kumar Reddy alias G.Sudheer Reddy, S/o Mr.G.S.S.N. Reddy, Aged about 29 yrs,Occ: Business, H.no.2-296, Srinagar, Near Padmasri Theatre, Anaparthy, East Godavari District-533342.
Or
Mr.G.Sudheer Kumar Reddy alias G.Sudheer Reddy, S/o Mr.G.S.S.N. Reddy, Vikram Polymers, D.no. 8-234/2, Anaparthy, East Godavari District – 533342.
...Defendant

Whereas the above named Plaintiff has filed the above suit O.S.No 1688 of 2021 on the file of Hon'ble V Junior Civil Judge, City Civil Court, Hyderabad against you for recovery of due amount of Rs. 1,50,679.92 to your credit card ending with no. -1006. You are therefore directed to appear in person or through Advocate on 21.7.23 at 10.30a.m. to answer the suit, failing which the suit will be decided exparte. Take notice accordingly.

[AS PER THE COURT ORDER]

M.V.NAGARAJ.
V.V.S.ANNARAM
Counsel for Plaintiffs.
H.No. 1-1-336/18,
Chikkadapalli,Hyderabad.
Cell:98496-66587